
సాక్షి ఒడిశా

గురువారం । 20 । జూన్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు - రూ. 6,75,920
బంగారం - 21 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి - 22 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



తుపాకీల తయారీ గుట్టురట్టు

నాటు తుపాకీల తయారీ గుట్టు రట్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి బుధవారం వెల్లడించారు. - 8లో.



బరిణిపుట్‌లో బీభత్సం

బరిణిపుట్‌లో అర్ధరాత్రి వేళ ఓ ట్రక్, గ్యాస్ ట్యాంకర్ బీభత్సం సృష్టించాయి. అతివేగంతో పరస్పరం ఢీకొనడంతో దుకాణాలు ధ్వంసమయ్యాయి. - 8లో.

న్యూస్‌రీల్

విశ్రాంత కార్మికుల ధర్నా



పేపర్ మిల్లు వద్ద ధర్నా నిర్వహిస్తున్న విశ్రాంత కార్మికులు

జయపురం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జయపురంలోని సేవా పేపరుమిల్లు విశ్రాంత కార్మికులు బుధవారం నిరవధిక ధర్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల యాజమాన్యంతో జరిగిన చర్చల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. 2020 ఏప్రిల్ నుంచి ప్రావిడెంట్ ఫండ్ చెల్లించాలని, పీఎఫ్ ఖాతాలను రెగ్యులర్ చేయాలని, బరంపురం పీఎఫ్ కార్యాలయం పరిధిలోని పీఎఫ్‌లను బరంపురంలోనే కొనసాగించాలని, పెండింగ్ జీతాలు, గ్రాట్యుటీ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన కొనసాగుతుందని పేపరుమిల్లు కార్మిక సంఘ నేత ప్రమోద్‌కుమార్ మహంతి స్పష్టం చేశారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య




చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ మా మార్కమా మందిరం వెనుక ఓ చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు బిసంకటక్‌లోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న రశ్మీరంజన్ ఆచార్య(29)గా గుర్తించారు. గామంచాతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. రశ్మీరంజన్ కొద్దినెలల కిందటే బిసంకటక్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్ నాయక్ కుమార్తెను వివాహం చేసుకుని అదే ప్రాంతంలో వేరే ఇంట్లో భార్యతో కలిసి ఉంటున్నారు. ఇంతలో ఏం జరిగిందో గానీ శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్లాకిమిడి: పర్లాకిమిడి గ్రిడ్ ప్రాంతంలో ఎన్.1 సప్లయ్‌లో భాగంగా గుణుపురం–పర్లాకిమిడి 132/33 కె.వి.లైన్ స్ట్రింగ్ పనులు జరుగుతున్నందున గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. పర్లాకిమిడి, కాశీనగర్, గుణుపురం, గుసాని సమితిల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నవీన్



నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ను బిజూ జనతా దళ్ (బీజేడీ) బుధవారం నియమించింది. ప్రతిపక్ష ఉపనేతగా సీనియర్ నేత, రైరఖోల్ ఎమ్మెల్యే డాక్టర్ ప్రసన్న ఆచార్యను బీజేడీ లెజిస్లేచర్ పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. బింఝార్‌పూర్ ఎమ్మెల్యే ప్రమీలా మల్లిక్ ప్రతిపక్ష చీఫ్ విప్‌గా, ఆలి ఎమ్మెల్యే ప్రతాప్ కేశరీ దేబ్‌ను డిప్యూటీ చీఫ్ విప్‌గా నియమించారు. ఇటీవలి ఎన్నికల్లో ఎన్నికైన బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేలని అభినందించిన నవీన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బిజూ జనతా దళ్ స్థానిక పార్టీ ప్రధాన కార్యాలయం 'శంఖభవన్'లో కొత్తగా ఎన్నికైన 51 మంది ఎమ్మెల్యేలు, కొంతమంది సీనియర్ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి నవీన్ పట్నాయక్ అధ్యక్షత వహించారు. ఇటీవల ముగిసిన రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో బీజేడీ 51 సీట్లు గెలుచుకుని రెండో స్థానంలో నిలిచింది. 147 మంది సభ్యులున్న అసెంబ్లీలో 78 మంది సభ్యులతో బీజేపీ తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ కేవలం 14 సీట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొత్త ప్రతిపక్ష నేతగా సరికొత్త పాత్రలో సభలో ప్రత్యక్షం కానున్నారు.



అమ్మవారికి ప్రీతికరమైన భోగాల సమర్పణ



ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా నగర పరిక్రమణ

- కొనసాగుతున్న బురదలపోలమ్మ ఉత్సవాలు
- ప్రముఖులకు ఆహ్వానం



రాయగడ ఎమ్మెల్యే కద్రకను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు



భోగాలను తీసుకొస్తున్న భక్తులు

రాయగడ: గ్రామదేవత బురదల పోలమ్మ తల్లి వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అక్కాచెల్లెళ్లతో కలిసి నగర పరిక్రమణ ప్రారంభించారు. గ్రామంలోకి ఎటువంటి దుష్టశక్తులు ప్రవేశించకుండా ఈ ప్రక్రియ నిర్వహించారు. మరో ఆరు రోజుల ఉత్సవాలు కొనసాగుతాయి. పట్టణంలోని పలు వీధుల్లో అమ్మవారి ప్రతీకలుగా నిలిచే ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. ముందుగా అమ్మవారి పాలజంగిడిని ఘటాలతో పేరంటాలు, పూజారి ఊరేగింపు చేపడతారు. పేరంటాలు ఒకే రంగు దుస్తులను ధరించి కాళ్లకు ఎర్రటి రంగు పూసుకుని ఊరేగింలో పాల్గొనడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నిర్వాహకులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అమ్మవార్లకు భోగాలు..

దుష్టశక్తులను తుదముట్టించి అక్కా చెల్లెళ్లతో కొలువుదీరిన అమ్మవారికి గ్రామస్తులు భోగాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏడాది ఈ ఆచారాన్ని కొనసాగించడంతో పాటు అమ్మవారికి మొదటి భోగం బార్జి శంకరం నాయుడు ఇంటి నుంచి రావడం ఆనవాయితీ. ఈ క్రమంలో బార్జి సాగర్ కుటుంబీకులు అమ్మవారికి బుధవారం భోగాలు సమర్పించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరమాన్నం, పండ్లు ఇతర నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. ఈ ఏడాది ఉత్సవాలకు పట్టణ ప్రముఖులకు నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు అందించారు. రాయగడ పట్టణ ప్రముఖుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి క్రద్రక తదితరులకు ఆహ్వానాలు అందజేశారు.

ఒత్తిడి లేని విద్య అవసరం

- సెంచూరియన్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ రాజేష్ పాఢి



మాట్లాడుతున్న రాజేష్ పాఢి



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

రాయగడ: విద్యావిధానంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, పోటీని సమర్థంగా ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలే తప్ప వారిని ఒత్తిడికి గురి చేయకూడదని సెంచూరియన్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ రాజేష్‌కుమార్ పాఢి అన్నారు. సదరు సమితిలోని పితామహల్ ఇండస్ట్రియల్ కాలనీలో సెంచూరియన్ విద్యాసంస్థల క్యాంపస్‌లో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తిని తెలుసుకుని ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. సెంచూరియన్ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. గత ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థును అభినందించారు. ఈ ఏడాది కూడా 120 మంది విద్యార్థులు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఇక్కడికి చదువుకునేందుకు రావడం హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ స్వాగతం పలికారు. సెంచూరియన్ విద్యాసంస్థల అధ్యక్షుడు రాధాకృష్ణ మహాపాత్రో మాట్లాడుతూ విద్యార్థుల నడవడికను తెలుసుకునేందుకు తల్లిదండ్రుల కోసం ఏర్పాటు చేసిన సీపీఎస్ కనెక్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ధాన్యం మద్దతు ధర పెంచాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంచ్ ప్రతినిధులు

జయపురం:

రబీ సీజన్‌లో పండిన ధాన్యం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,100 చెల్లించాలని కొరాపుట్ జిల్లా కృషక్ కళ్యాణ మంచ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కృషక్ కళ్యాణ మంచ్ కొరాపుట్ జిల్లా కార్యదర్శి నరేంద్ర ప్రధాన్ నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం జయపురం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని మండీల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు 15,919 మంది రైతులను ఎంపిక చేశారని, అయితే ఇప్పటి వరకు 1200 మంది మాత్రమే లబ్ధి పొందారని చెప్పారు. మండీలలో కొనుగోలు చేసే సంస్థలు, అధికారులు, మిల్లర్లు సకాలంలో రావడం లేదని, ధాన్యానికి అదనంగా 5 నుంచి 7 కేజీలు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ నెల 30లోగా అందరి రైతుల వద్ద నుంచీ ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కాలువలో పడి బాలుడి మృతి

- విచారణకు ఆదేశించిన మంత్రి డాక్టర్ కృష్ణచంద్ర మహాపాత్రో
- రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం



ఘటనా స్థలంలో బీఎంసీ అధికారులతో మాట్లాడుతున్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ చంద్ర మహా పాత్రో

భువనేశ్వర్: స్థానిక యూనిట్–3 మసీదు కాలనీ సమీపంలో కాలువలో పడి ఎనిమిదేళ్ల బాలుడు అబ్బూ బకర్ సాహ మృతి చెందాడు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నగరంలో వర్షం ప్రారంభమైంది. ఆ సమయంలో కొందరు చిన్నారులు మసీదు సాహి సమీపంలో ఆడుకుంటున్నారు. ఇంతలో డ్రెయిన్‌లో బెలూన్ కనిపించడంతో అబ్బూ బకర్ కాలువ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలువలో పడిపోయాడు. వర్షం కారణంగా డ్రెయిన్‌లో నీరు ప్రవహించడంతో చిన్నారి కనిపించకుండా పోయాడు. మిగతా పిల్లలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో కాలువలో వెతికారు. లక్ష్మి సాగర్ ప్రాంతం వద్ద బాలుడిని వెలికితీసి స్థానిక క్యాపిటల్ ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు డాక్టర్ నిర్ధారించారు.

పరిస్థితిని సమీక్షించిన మంత్రి..

ఈ విషాద సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో బుధవారం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కాలువపై ప్రమాద నివారణకు కంచె ఎందుకు ఏర్పాటు చేయలేదో సాయంత్రంలోగా నివేదిక అందజేయాలని బీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. స్థానిక ఎంపీ అపరాజిత షడంగి మృతుడి ఇంటికి వెళ్లి సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు పరిహారంగా ప్రకటించింది.

సీఎం సంతాపం..

బాలుడి మృతి పట్ల ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఘటన కలవరపరిచిందని, చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా తమ ప్రభుత్వం కృషి చేస్తుంద 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అంతకుముందు ఈ ఘటనపై రెవెన్యూ, విపత్తు నివారణ శాఖ మంత్రి సురేష్ పూజారి విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

స్పీకర్ పదవికి సురమా పాఢి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న సురమా పాఢి

భువనేశ్వర్: రాణొపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా సురమా పాఢి తదుపరి స్పీకర్ కానున్నారు. బుధవారం జరిగిన బీజేపీ శాసనపక్ష సమావేశంలో ఆమెను స్పీకర్ పదవికి ప్రతిపాదించారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు సురమా పాఢి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఉపముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా సహా కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరయ్యారు. స్పీకర్ అభ్యర్థి కోసం బీజేపీ శాసన పక్షం ఉదయమే సమావేశమైంది. స్పీకర్‌గా ఎవరిని నామినేట్ చేయాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. సురమా పాఢి అభ్యర్థిత్వం పట్ల సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఓటు వేశారు. శాసన సభలో బీజేపీకి తగినంత సంఖ్యా బలం ఉండటంతో సురమా పాఢి ఏకగ్రీవంగా ఎన్నికవుతారని భావిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల నుంచి స్పీకర్ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించకపోవడంతో ఆమె అఖండ మెజారిటీతో ఎన్నిక కావడం ఖాయమని భావిస్తున్నారు. అధికారిక ప్రకటన కోసం నిరీక్షిస్తున్నారు.

• హనుమ మాటలు వినుమా..!



నిత్యం రద్దీగా ఉండే జిమిడిపేట రోడ్డులో అకస్మాత్తుగా ఆంజనేయ స్వామి ప్రత్యక్షమయ్యారు. వాహనాలను ఆపి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవుపలికారు. ముఖ్యంగా ఆటోలు, పాసింజర్ వ్యాన్‌లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు పోతున్నారని, ఇకపై అలా చేయవద్దని తనదైన శైలిలో చెప్పి ఆకట్టుకున్నారు. జిల్లా మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు మోహనరావు మాఝి బుధవారం మజ్జిగౌరి అమ్మవారి వార్షికోత్సవాల సందర్భంగా ఇలా ప్రత్యేక వేషధారణతో అవగాహన కల్పించారు.

– రాయగడ

వంతెనపై ఇరుక్కున్న ట్రక్



బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన బీడీ ఆకుల ట్రక్

జయపురం: జయపురం సమితి పాత్రోపుట్ సమీపంలో ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన ఇనుప వంతెన మధ్య బీడీ ఆకులు రవాణా చేస్తున్న ఓ ట్రక్కు బుధవారం ఇరుక్కుపోయింది. పరిమితికి మించిన ఎత్తులో బీడీ ఆకుల బస్తాలు లోడు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడ– రాంచీ 326 కారిడార్ మార్గమైన జయపురం– మల్కనగిరి రహదారిలో పాత్రోపుట్ సమీపంలో ఈ వంతెన ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ వంతెన మీదుగా నిత్యం బీడీ ఆకులు రవాణా అవుతుంటాయి. విషయం తెలుసుకున్న కొందరు వెళ్లి బస్తాలు కిందకు దించడంతో ట్రాఫిక్ సమస్య సద్దుమణిగింది.

దూసుకొచ్చిన మృత్యువు

- కారును ఢీకొట్టిన ట్రక్కు
- సీరియల్ నటి మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



నుజ్జయిన కారు



ప్రమాదానికి కారణమైన ట్రక్కు

భువనేశ్వర్: కటక్ కువాఖాయ్ వంతెనపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒడియా టీవీ సీరియల్‌లో నటిస్తున్న ఒకరు మరణించగా మరో నలుగురు మృత్యువుతో పోరాడుతున్నారు. ఎదురుగా వస్తున్న ట్రక్కు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన కారు నుజ్జునుజ్జయ్యింది. టీవీ సీరియల్‌లో నటిస్తున్న ముగ్గురు మహిళలు(సాలేపూర్ ప్రాంతానికి చెందిన వారు) బుధవారం తెల్లవారుజామున 2 నుంచి 2.30 గంటలకు షూటింగ్ ముగించుకుని కారులో ఇంటికి బయలుదేరారు. కటక్ జిల్లా త్రిసులియా సమీపంలోని కువాఖై వంతెనపై ట్రక్కు అతివేగంతో ఢీకొట్టడంతో కారులో ఓ నటి అక్కడికక్కడే మరణించింది. మరో ఇద్దరు మహిళలు, కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఎస్సీబీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేర్చారు. ఈ ప్రమాదంలో ట్రక్ డ్రైవర్ కూడా గాయపడ్డాడని, ఎస్సీబీలో చికిత్స పొందుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. కారుని ఢీకొనడం వల్ల సిమెంట్ లోడుతో దూసుకుపోతున్న లారీ బ్రిడ్జిపై నుంచి అదుపు తప్పి నదిలో పడింది. ఈ ప్రమాదంలో కారు కూడా పూర్తిగా దెబ్బతింది. కారు డ్రైవర్ చేతులు విరగగా, గాయపడిన ఇద్దరు మహిళల తలలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు, మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. ట్రక్కు ఢీకొనడంతో వంతెనపై కొంత భాగం దెబ్బతింది.

క్లుప్తంగా

శ్రీముఖలింగంలో పండిత సదస్యం



శ్రీముఖలింగం పండిత సదస్సు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంకురార్పణ, హోమం, పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు

రూ.3.23 లక్షలకు శ్రీముఖలింగం మార్కెట్ వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

జలుమూరు: శ్రీముఖలింగం మార్కెట్ ఆశీలు వేలంపాట రూ.3,23,000 లకు గ్రామానికి చెందిన అప్పన్న బారికో దక్కించుకున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి గోపి బాల బుధవారం తెలిపారు. ఏడాదికి ఒక్క సారి నిర్వహించే వేలం పాట గ్రామ సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరి ప్రసాద్, గ్రామ పెద్దలు బీవీ రమణ తదితరుల సమక్షంలో నిర్వహించినట్లు ఈఓపీర్డీ ఉమా మహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి జమున సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి



వెంకటరావు(ఫైల్)

నరసన్నపేట: స్థానిక వీరన్నాయుడు కాలనీకి చెందిన బాషా వెంకటరావు (77) వడదెబ్బకు మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం వీరన్నాయుడు కాలనీ నుంచి బజారు వీధికి పనిపై వెళ్లిన వెంకటరావు సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సహకారంతో బజారు వీధిలో గాలించగా ఒక చోట గోడకు ఆనుకొని చనిపోయి కనిపించారని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో కుల సంఘ ప్రతినిధులు విరాళాలు సేకరించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం మీడియా కార్యదర్శిగా చౌదరి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం మీడియా కార్యదర్శిగా చౌదరి లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు సీపాన వెంకట రమణ తనను నియమిస్తూ నియామక పత్రం, గుర్తింపు కార్డు అందించారన్నారు. తాను శ్రీకాకుళం జిల్లా జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షునిగా, శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మీడియా సెల్ కన్వీనర్‌గా పనిచేశానని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్, శ్రీకాకుళం జర్నలిస్ట్ ఫోరమ్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షునిగా, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీ సీ, మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా, జిల్లా ఉపాధ్యక్షునిగా పనిచేస్తున్నానని తెలిపారు.

'రాహుల్ నాయకత్వం దేశానికి అవసరం'



పండ్లు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: స్వర్గీయ రాజీవ్ గాంధీ తనయుడు, యువనేత రాహుల్‌గాంధీ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సాధారణంగా కేక్ ను కత్తిరించే కార్యక్రమానికి భిన్నంగా పండ్లను కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో పేదలు మరింత పేదలుగా మిగిలిపోతున్నారని, కేవలం కార్పొరేట్ సంస్థలకే కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. పేదలకు మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, అంబటి కృష్ణారావు, డి.గోవింద మల్లిబాబు, కేపీఎల్ఎస్ ఈశ్వరి, రెల్ల సురేష్, జీపీ నాయుడు, దీర్ఘాసి వెంకట్రావు, ఎం.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బరిణిపుట్‌లో బీభత్సం

- అర్ధరాత్రి వేళ పరస్పరం ఢీకొన్న ట్రక్, గ్యాస్ ట్యాంకర్
- ధ్వంసమైన దుకాణాలు
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



బోల్తాపడిన గ్యాస్ ట్యాంకర్



దుకాణాలపైకి దూసుకెళ్లిన ట్రక్

జయపురం: అర్ధరాత్రి వేళ ఓ ట్రక్, గ్యాస్ ట్యాంకర్ బీభత్సం సృష్టించాయి. అతివేగంతో పరస్పరం ఢీకొనడంతో దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం కలగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో జయపురం సమితి జాతీయ రహదారిలో బరిణిపుట్ పంచాయతీ కార్యాలయం 14 చక్రాల ట్రక్, గ్యాస్ ట్యాంకర్ పరస్పరం ఢీకొన్నాయి. అదుపు తప్పిన ట్రక్కు రోడ్డు పక్కన ఉన్న మూడు దుకాణాలపై దూసుకెళ్లడంతో సామగ్రి ధ్వంసమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రక్ జయపురం నుంచి వెళ్తుండగా.. గ్యాస్ ట్యాంకర్ కొరాపుట్ నుంచి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న బరిణిపుట్ పోలీసులు, జయపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. వాహనాలను తొలగించి ట్రాఫిక్ చక్కదిద్దారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్లను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కారు ఢీకొని ఒకరి మృతి



ప్రమాదానికి గురైన వాహనాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి పండ్రీపణి పంచాయతీ బిజాఘటి గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయపురం నుంచి మల్కన్‌గిరి వస్తున్న ఓ కారు అదుపు తప్పి సిగ్నల్ బోర్డును ఢీకొని అటుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు కింద పడ్డారు. స్థానిక రైతులు వీరిని గుర్తించి వెంటనే మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఒకరు మృతిచెందారు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వీరు స్పృహలోకి వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన కారు మల్కన్‌గిరికి చెందిన జి.సత్యారావుదిగా తెలిసిందన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఇద్దరున్నారని, వెంటనే పరారయ్యారని స్థానికులు చెబుతున్నారని, వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

ప్రపంచ శ్రేణి జూగా నందన్‌కానన్



నందన్‌కానన్ సమీక్ష సందర్శనలో విభాగం మంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో బారంగ్ నందన్‌కానన్ జంతు ప్రదర్శన శాలని ప్రపంచ శ్రేణి వన్యప్రాణుల ప్రదర్శన శాలగా తీర్చిదిద్దాలని రాష్ట్ర అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పు, కార్మిక, ఉద్యోగుల బీమా శాఖ మంత్రి గణేశ్రామ్ సింగ్‌ఖుంటియా పిలుపునిచ్చారు. బారంగ్ నందన్‌కానన్‌లో కొనసాగుతున్న కార్యకలాపాలను బుధవారం సమీక్షించారు. నందన్‌కానన్‌ను ప్రపంచ స్థాయి జంతుప్రదర్శనశాలగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని యాజమాన్యం, సిబ్బందిని ఆదేశించారు.

జిల్లా కన్వీనర్‌గా భమిడిపాడి



భమిడిపాటి గౌరీశంకర్



ఉమాకవి

శ్రీకాకుళం కల్చరల్: 'జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనం'కు శ్రీకాకుళం జిల్లా కన్వీనర్‌గా గాయత్రీ కాలేజి తెలుగు విభాగాధిపతి భమిడిపాడి గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శిగా చైతన్య కిరణాలు, బాలకథానిలయం అధ్యక్షులు డాక్టర్ భోగెల ఉమాకవిలను ఎంపికచేసినట్లు వేదిక కన్వీనర్ డాక్టర్ జీవీ పూర్ణచంద్ ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 28, 29 తేదీల్లో విజయవాడ కేంద్రంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు, 40 ఏళ్లలోపు రచయిత, రచయిత్రులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి రుసుం లేదని, ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9492858395 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీఓడబ్ల్యూ పోస్టర్ ఆవిష్కరణ

కాశీబుగ్గ: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) అర్ధ శతాబ్ది ముగింపు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బుధవారం పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జూన్ 22న జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బర్ల జానకి, హేమక్క, జానికమ్మ, సావిత్రమ్మ, రాజమ్మ, పుణ్యావతి, లక్ష్మమ్మ, తవిటమ్మ, మహాలక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.

నాటు తుపాకీల తయారీ గుట్టురట్టు



నిందితుడు గంగాధర కమర



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ, ఇతర పరికరాలు

జయపురం: నాటు తుపాకీల తయారీ గుట్టు రట్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి బుధవారం వెల్లడించారు. జయపురం సమితి బలియ పంచాయతీ చందిలి గ్రామం వద్ద మంగళవారం ఎస్ఐ ప్రమోద్‌కుమార్ పాణి, ఏఎస్ఐ పంకజనీ శబర నేతృత్వంలో పెట్రోలింగ్ జరుపుతుండగా ఆ ప్రాంతంలో నాటు తుపాకీలు తయారు చేస్తున్న కర్మాగారం ఉందని తెలుసుకున్నారు. వెంటనే బృందంతో కలిసి చందిలి గ్రామంలో గంగాధర కమర ఇంటిపై దాడులు నిర్వహించారు. నాటు తుపాకీతో పాటు గన్ తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్లుగా తుపాకీలు తయారు చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామని, తుపాకీల తయారీ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనేది గగణాపూర్ పోలీసు పంటి అధికారి రాజకిశోర్ బారిక్ దర్యాప్తు జరుపుతున్నారని పోలీసు అధికారి ఈశ్వర తండి చెప్పారు.

రక్తహీనతను అధిగమిద్దాం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మల్కన్‌గిరి: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో బుధవారం రక్తహీనత అవగాహన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ మాట్లాడుతూ సరైన పోషకాహారం తీసుకుంటే సికిల్‌సెల్ సమస్యను అధిగమించవచ్చన్నారు. అనంతరం 40 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి కాలేజ్ ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన పర్లాకిమిడి ఎమ్మెల్యే



నవీన్ పట్నాయక్‌తో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి నియోజకవర్గ బీజేడీ ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి బుధవారం భువనేశ్వర్‌లోని ఒడిశా అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ రణేంద్ర ప్రతాప్ స్వయి సమక్షంలో శాసన సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం బీజేడీ ముఖ్యనేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను రూపేష్ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి కూడా ఉన్నారు.

శాస్త్రోక్తంగా ఔపోసనా హోమాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా బుధవారం ఔపోసనా హోమాలు జరిగాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రదోష కాలంలో నందీశ్వరునికి క్షీరాభిషేకాలు, అమ్మవారికి హారతి అనంతరం సహస్ర పుష్ప అలంకరణ జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ పండితులు ఆరవెల్లి హరగోపాల్ శర్మ, గన్నవరం కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులు, ఆలయ ఈఓ సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, లలితా మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముప్పై ఏళ్లకు ముచ్చటైన పంట

- ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం
- ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం
- జిల్లా వ్యాప్తంగా 2 వేల హెక్టార్లలో సాగు
- ఏటా ఒక్కో మొక్కకు 12 గెలల ఫలసాయం



బూర్జ గ్రామంలో ఆయిల్ పామ్ తోటలు



మామిడివలసలో ఆయిల్ పామ్ మొక్కలు

బూర్జ: ఆయిల్ పామ్ సాగు రైతుల ఆదాయాన్ని పెంచుతోంది. ఆయిల్ పామ్ అత్యధిక నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ఒకటి. హెక్టారుకు 20 టన్నుల పళ్ల గెల దిగుబడినిస్తుంది. అలాంటి ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వాలు కూడా ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాయి. దీంతో రైతులు ఈ తరహా పంటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2000 హెక్టార్లలో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నారు. పామాయిల్ పంటల్లో అంతర పంటలు వేసి వాటిలోనూ లాభాలను సంపాదించుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- ఏడాది పొడవునా నెలవారీ ఆదాయం, మార్కెట్ ధరకు హామీ ఉంటుంది.
- దొంగతనం భయం ఉండదు.
- ఆయిల్ పామ్ పంటలో తెగుళ్లు, వ్యాధులు చాలా తక్కువ.
- మొదటి మూడేళ్లలో ఏకవార్షిక పంటలైన కూరగాయలు, పూలు, అరటి, పసుపు, అల్లం, పైనాపిల్ వంటివి అంతర పంటలుగా వేసుకోవచ్చు. ఆ తర్వాత నీడను ఇష్ట పడే పంటలు (కోకో) అంతర పంటగా సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.
- ఆయిల్ పామ్ 4-6 ఏళ్ల గల తోట నుంచి ఎకరానికి 8-10 టన్నులు దిగుబడి వస్తుంది.
- 30 ఏళ్ల పాటు ఫలసాయం వస్తుంది.

రాయితీ ఇలా..

- ఆయిల్ పామ్ సాగులో రెండు రకాల మొక్కలను సాగు చేసేందుకు ఉపయోగిస్తారు.
- స్వదేశీ రకం ఒక్కో మొక్కకు రూ. 133లు, దిగుమతి రకం మొక్కకు రూ. 193ల రాయితీ ప్రభుత్వం అందిస్తుంది. ఒక్క ఎకరాకు 60 మొక్కలు చొప్పున నాటాలి. ఒక్క ఎకరాకి ఇండిగోనియస్ రకానికి రూ. 8000 సబ్సిడీ, ఎగుమతి రకానికి రూ.11,600 చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది.
- ఆయిల్ పామ్ మొక్క కొనుగోలుకి ప్రభుత్వం స్వదేశీ రకానికి హెక్టార్‌కి రూ.20,000 దిగుమతి రకానికి రూ.28,400 రాయితీని కల్పిస్తుంది.
- మొదటి నాలుగేళ్లకి ఖర్చుల కోసం ఏడాదికి రూ. 5250 చొప్పున హెక్టారుకి రూ. 21,000, అంతర పంటలు పండించేందుకు మొదటి నాలుగేళ్లకు హెక్టారుకు రూ.21,000 రాయితీ కల్పిస్తుంది.
- ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ బిందు సేద్యం పరికరాలకు కూడా చిన్న, సన్నకారు రైతులకు అందజేస్తుంది. జాబ్ కార్డు ఉన్న చిన్న, సన్నకారు వ్యవసాయ రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తుంది.

రైతుల్లో ఆసక్తి

ప్రస్తుతం ఇతర పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం. ఆయిల్ పామ్ పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు లాభదాయకంగా ఉండడంతో మన జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా గార, రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస, నరసన్నపేట, పాలాకి, శ్రీకాకుళం మండలాలతో పాటు సుమారు 27 మండలాల్లో పంటకు అనుకూలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇదివరకు జిల్లాలో రెండు ఆయిల్ పామ్ కంపెనీలు (పతంజలి ప్రైవేట్ ఫుడ్ కంపెనీ, శ్రీశ్రీనివాస ఆయిల్ మిల్) 20 మండలాల్లో మొక్కలు సరఫరా చేశాయి. ఇప్పుడు జిల్లాలో మరో ఆరు మండలాలను ఆయిల్ పామ్ సాగు మండలాలుగా గుర్తించారు. ప్రస్తుతం ఒక ఆయిల్ పామ్ కంపెనీ ఎం/ఎస్ శాంతి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అదనంగా జిల్లాలో ఆయిల్ పామ్ మొక్కలు సరఫరా చేసేందుకు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.


చక్కటి ఆదాయం



ఆయిల్ పామ్ పంటల వల్ల రైతులకు మంచి గిట్టుబాటు ధరతోపాటు మంచి ఆదాయం చేకూరుతుంది. ఇది 30 ఏళ్ల పంట. సన్న చిన్న కారు జాబ్ కార్డు ఉన్న వ్యవసాయ రైతులకు ఉపాధి హామీ పనుల్లో భాగంగా పనులు కల్పిస్తుంది. టన్ను రూ. 13 వేలు వరకు అమ్ముడుపోతుంటుంది. ఏడాదికి ఒక్క ఎకరా 8-10 టన్నులు వరకు వస్తుంది. అంతర పంటలు వేసుకోవచ్చు. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ ఉంటుంది. రైతులు ఆయిల్ పామ్ పంటలపై ఆసక్తి కనబరచాలి. మొక్కలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుంది. పంట వేసిన నాలుగేళ్ల వరకు ఖర్చులు, పెట్టుబడి ప్రభుత్వమే భరిస్తుంది. అంతర పంటలకి కూడా పెట్టుబడి సహాయం చేస్తుంది.

– బి.అవంతి కుమారి, ఉద్యాన అధికారి, బూర్జ మండలం

చ



జిల్లాలో రెండు వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఈ పంటలకు నీరు, దారి ముఖ్యం. ప్రభుత్వం ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తుంది. ఎరువులు, అంతర పంటలకు నాలుగేళ్ల వరకు ప్రభుత్వమే సహాయం చేస్తుంది. చీడపీడలు, దొంగల భయం ఉండదు. ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ. పంటలు వేసిన 8-10 ఏళ్లకు 140 నుంచి 150 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను ధర రూ. 13000 వరకు పలుకుతుంది.

– రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి, శ్రీకాకుళం.

రోడ్డు ప్రమాదంలో యువకుడు వ్యక్తి మృతి

బూర్జ: మధ్యప్రదేశ్ రాష్ట్రం నీమశ్చ గ్రామానికి చెందిన సోహన్ గాడ్ (32) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. మండలంలో గల పెద్దపేట పంచాయతీ మదనాపురం గ్రామ జంక్షన్ సమీపంలో మధ్యాహ్నం శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై ప్లాస్టిక్ డబ్బాలు అమ్ముకోవడానికి బైక్‌పై దిగుతుండగా ఆమదాలవలస నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో యువకుడికి బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు చనిపోయాడు. అవుట్ పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్లాస్టిక్ డబ్బాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడని స్థానికులు తెలియజేశారు.

ఈదురుగాలుల బీభత్సం

ఇచ్ఛాపురం: పట్టణంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన కుండపోత వాన కురిసింది. ఈ గాలుల ధాటికి లాలాపేట, బంగ్లారోడ్, గాంధీపార్కులైన్, మున్సిపల్ కార్యాలయం మెయిన్‌రోడ్‌లో గల పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో లాలాపేటకు చెందిన పైల మోహనరావుకు చెందిన ఆటో పూర్తిగా ధ్వంసమైంది. పట్టణంలో 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురు గాలుల బీభత్సానికి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

రంగంవలసలో ఏనుగుల బీభత్సం



రంగంవలస పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సీతంపేట: మండలంలోని రంగంవలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మూడు రోజులుగా ఇక్కడ తిష్టవేసిన నాలుగు ఏనుగులు కొండచీపుళ్లు, జీడి, అరటి వంటి పంటలను నాశనం చేస్తున్నాయని గిరిజనులు తెలిపారు. ఏనుగుల ఘీంకారానికి రాత్రి సమయంలో నిద్ర ఉండడం లేదని వాపోయారు. కొండపోడు పనులకు వెళ్లాలంటే భయం వేస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారుల జాడలేదని తెలిపారు.

సాగు పట్టాలు ఇప్పించండి

- గిరిజనుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

పార్వతీపురంటౌన్: తాము సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు ఇప్పించండంటూ గిరిజన గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మండలంలోని సంగంవలస పంచాయతీ లోగల సీతంపేట 20 కుటుంబాల గిరిజనులు, గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడువలస, వెలగవలస పంచాయతీ వెలగవలస గ్రామం, సందివలస, ములగ, దోనిగెడ్డవలస, డోకిశీల పంచాయతీ తేలునాయుడువలస, ములగ పంచాయతీ, ఏడీవలస గిరిజనులు, గ్రామస్తులు తమ సమస్యలను తహసీల్దార్‌కు విన్నవించారు. తాము సాగుచేస్తున్న భూములకు సర్వే పూర్తయింది కానీ పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఐదు పంచాయతీ గ్రామాల ప్రజలకు పట్టాలు ఇప్పించాలని కోరారు.

నీట్ పరీక్ష ఫలితాలపై న్యాయవిచారణ జరిపించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర జిల్లా ప్రధానకార్యదర్శి నాగభూషణం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బొబ్బిలి: దేశంలోనే సంచలనం సృష్టించిన నీట్ పరీక్షా ఫలితాల్లో అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో ఏఐఎస్ఎఫ్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా ఫలితాలపై న్యాయవిచారణ జరిపించాలని లేని పక్షంలో పోరుబాట పడతామని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్యా, రాజకీయ శిక్షణ తరగతులను జూలై 8 నుంచి 10వ తేదీవరకు కాకినాడలో నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి-గజపతినగరం మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్సై రవివర్మ, కానిస్టేబుల్ ఈశ్వరరావు బుధవారం తెలిపారు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ కాలు జారి పడిపోయాడా? లేదా పట్టాలు దాటుతుండగా రైలు కింద పడి మృతి చెందాడా? అన్నది తెలియాల్సి ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది ఫోన్ 94906 17089, 94918 13163 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

గంట్యాడ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు పట్టుకున్నారు. మండలంలోని చంద్రంపేట గ్రామంలో ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఎస్ఈబీ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆమె దగ్గర నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

దిగుబడి ‘వెద’జల్లాలంటే..!



వెద జల్లేందుకు భూముల్లో సమాంతర దుక్కు చేసిన రైతులు



పాలకొండ మండలంలోని రాజుపేట వద్ద వరి వంగడాలను వెద జల్లుతున్న రైతులు

- వ్యవసాయంలో వెద సాగుపై కర్షకుల ఆసక్తి
- వరి నాట్లకు ప్రత్యామ్నాయం
- సాధారణ పంట కాలం కంటే పది రోజులు ముందు
- పెట్టుబడులు తక్కువ..లాభాలు ఎక్కువ
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో రుతుపవనాల అనుకూలతతో తొలకరి వర్షాలు పలకరిస్తున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలంబాట పడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 73 వేల హెక్టార్లలో సాగు లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది. ఈ క్రమంలో ఏటా 17వేల హెక్టార్లకు పైబడి వెదజల్లే పద్ధతిని రైతులు అనుసరిస్తున్నారు. రైతుల అవసరాల మేరకు 26,416 క్వింటాళ్ల వరి వంగడాలు, 45.276 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించేలా 2024 ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు.ఈ మేరకు 306 ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిటకు సీజన్‌కంటే ముందుగానే విత్తనాలు, ఎరువులు అందించేలా కసరత్తు చేపట్టారు.

వాతావరణ సానుకూలతతో వెదలు..

ప్రస్తుత వాతావరణ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వరి సాగులో నారుమడులు వేయకుండా నేరుగా విత్తనాలు వేసే(వెదజల్లు) విధానాన్ని రైతులు అనుసరిస్తున్నారు. గత ఏడాది 17.58వేల హెక్టార్లలో వెద వేసిన రైతులు ఈ ఏడాది దాదాపు 18వేల హెక్టార్లలో ఈ విధానం అవలంబించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియతో ఎకరాకు దాదాపు 12 నుంచి 15 కిలోల విత్తనాలు ఆదా చేయవచ్చు. పెట్టుబడుల భారంతోపాటు సాగునీటి ఇబ్బందులు అధిగమించవచ్చు. పంట దిగుబడి సుమారు పదిరోజులు ముందుగా చేతికి వస్తుంది. నారు సకాలంలో అందక ఉడుపులు చేయలేకపోవడం, వ్యవసాయ కూలీల ఇబ్బందులు ఉండవు.

మన నేలలు అనుకూలం..

వెదజల్లే ముందు భూమి సమాంతరంగా ఉండేలా దమ్ము చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో సాంద్రత ప్రధానంగా ఉండేలా విత్తనాలు వేసుకోవాలి. మొదటి ఆకు విచ్చుకుని, పచ్చబడే వరకూ పొలంలో బురదపదును ఉండేలా జాగ్రత్త పడాలి. పలుచటి నీటి తడులు అందించాలి. 35 రోజుల తరువాత నీటి తడులు అందాల్సి ఉంటుంది. సాధారణ పద్ధతిలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి. ఈ విధానంలో నారు పెంచడం, ఆకుతీత, ఉడుపులు ఉండవు. దీంతో ఎకరాకు సుమారు రూ.5వేల మేరకు పెట్టుబడి తగ్గుతుంది.

తక్కువ నీటితో..

ఈ విధానంలో నీటి యాజమాన్యం కీలకం. వెదలు వేసిన పొలంలో నీటి నిల్వలు ఉండకుండా చూడాలి. నీరు నిలిస్తే మొలక శాతం తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సేద్యం చేయవచ్చు. ఈ పద్ధతి వల్ల పొలంలో మొక్కకు సూర్యరశ్మి, గాలి పుష్కలంగా సమకూరుతుంది. దీంతో చీడపీడల బెడద తగ్గి సస్యరక్షణ ఖర్చు తగ్గుతుంది. కిలో విత్తనాలకు ఒక గ్రాము బావిస్టిన్ పొడి లేక 3 గ్రాముల సూడోమోనాస్ లీటరు నీటిలో కలిపి 24 గంటల పాటు విత్తనాలు నానబెట్టాలి. తర్వాత మరో 24 గంటలు వాటిని గోనె సంచిలో వేసి మండీకట్టి వెదజల్లడం శ్రేయస్కరం. బంక నేలల్లో దమ్ము చేసిన మరుసటి రోజు వెదజల్లాలి లేకుంటే డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయవచ్చు. ఇసుక శాతం అధికంగా ఉండే నేలల్లో వెదలు వేసిన రోజు దమ్ము చేయాలి. తేలికపాటి నీటి తడులు ఉండేలా చూడాలి. భూసార పరీక్షలకు అనుగుణంగా సీజన్‌లో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులను అధికారుల సూచన మేరకు వాడాల్సి ఉంటుంది.

కలుపు యాజమాన్యం..

వెదజల్లిన 48 గంటలలోపు కలుపు నివారణ నిమిత్తం పిండిమిథాలిన్ వేయాలి. 15–20 రోజుల మధ్య పొలంలో ఊదా మొదలగు కలుపు ఎక్కువగా ఉంటే పొలంలో నీటి నిల్వలు లేకుండా చేసి సైహలోఫాస్ బ్యూటైల్ 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి, వెడల్పు ఆకుల కలుపు లేదా రెండూ ఉన్నట్లు గుర్తిస్తే బిస్పైరిబాక్స్ సోడియం 100–120 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. నెల రోజులకు వెడల్పు ఆకు కలుపు అధికంగా ఉంటే పొలంలో నీరు బయటకు పంపి (2–4డి) సోడియం సాల్ట్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలి. పొలం ఎరుపు రంగులో కనిపిస్తే యూరియా తగు మోతాదులో వేయాలి. సన్నజాతి గడ్డి నివారణకు ఫెనాక్సీ–ప్రాప్–పి–ఇథల్ 6.9శాతం 250 ఎంఎల్ 2వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా సమర్థవంతంగా కలుపు నివారణ చేయవచ్చు.

రైతులకు లాభదాయకం



వెదలు వేసే విధానం రైతులకు లాభదాయకం. సాగు నీటి ఇబ్బందులు, అధిక పెట్టుబడులు ఉండవు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడద తట్టుకుంటుంది. దిగుబడి పెరుగుతుంది. పంట కాలం తక్కువ. ఈ విధానాన్ని అవలంబించడం శ్రేయస్కరమే. ఇప్పటికే పలుచోట్ల రైతులు వెదలు వేశారు. వెద సాగుపై రైతులకు గ్రామస్థాయిలో అవసరమైన సలహాలను వ్యవసాయ సహాయకులు అందిస్తున్నారు.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఎ.డి., పాలకొండ

ఆన్‌లైన్‌లో ఆర్డర్: బిర్యానీలో పురుగులు

- రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్‌మీరా

విజయనగరం: నగరంలోని పలు రెస్టారెంట్‌లలో విక్రయించే ఆహారపదార్థాల్లో నాణ్యతలోపం మరోసారి బట్టబయలైంది. హరీష్ అనే వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు రెస్టారెంట్‌ను పరిశీలించిన ఫుడ్ సెఫ్టీ అధికారులు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన హరీష్ రింగ్‌రోడ్ ప్రాంతంలో గల క్రితుంగా రెస్టారెంట్‌లో ఉలవచారు బిర్యానీ కావాలంటూ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఇంటికి వచ్చిన ఆర్డర్‌ను తెరిచి చూడగా..పార్సిల్‌లో పురుగులు కనబడడంతో అవాక్కయ్యాడు. ఈ ఘటనపై ఫుడ్ సెఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటు స్పందించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించి..కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణంలో వంటకాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వాస్తవానికి వినియోగించే వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌడ్స్ మోతాదు 25లోపు ఉండాల్సి ఉండగా..38 శాతం ఉన్నట్లు ధ్రువీకరించారు. ఇటువంటి కలుషిత నూనెలతో తయారు చేసిన ఆహారాన్ని తింటే గ్యాస్టిక్, క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరించారు. అనంతరం సదరు రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్‌లలో కల్తీ ఆహారాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించిన వారు ఫోన్ 8790603489 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

22న పాలకొండలో జాబ్ మేళా

పార్వతీపురం: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించే నిమిత్తం అపోలో టైర్స్‌లో 150 ఉద్యోగాలు, మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నారని జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 22వ తేదీన పాలకొండ డిగ్రీ కళాశాలలో ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అపోలో టైర్స్ సంస్థలో 150 నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్ఏపీఎస్) ఉద్యోగాలకు 18 నుంచి 23 సంవత్సరాల వయస్సు కలిగి 2020–24బ్యాచ్‌కు చెంది, ఏదైనా డిప్లమా, బి.టెక్, డిగ్రీ విద్యార్హత కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఉద్యోగం కల్పించి, రూ.16 వేల జీతంతోపాటు ఫుడ్, ట్రాన్స్‌పోర్ట్, హాస్టల్ సదుపాయం కల్పిస్తారని తెలిపారు. మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80 ట్రైనీస్ ఉద్యోగాలకు 18 నుంచి 21 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్మీడియట్‌లో 50శాతం ఉత్తీర్ణత సాధించిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఉద్యోగం కల్పించి, రూ.15 వేల జీతంతో పాటు ఫుడ్, ట్రాన్స్‌పోర్ట్, హాస్టల్ సదుపాయం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్//ఎంప్లాయ్‌మెంట్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ ఫొటోలతో జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9908827160 నంబర్‌ను సంప్రదించవచ్చునని సూచించారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన మంత్రి



ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సందర్శించారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రికి వెళ్లిన ఆమె, అక్కడి రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న చికిత్స, అందుతున్న వైద్యసదుపాయాలపై ఆరా తీశారు. వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. పక్కనే నిర్మాణమవుతున్న వందపడకల ఆస్పత్రిని పరిశీలించారు. ఈ పనులు తమ ప్రభుత్వంలోనే పూర్తిచేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఆమె వెంట పలువురు వైద్యారోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన కేంద్ర బృందం



కేంద్ర బృంధ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని భారత శాస్త్ర సాంకేతిక బృంద ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలోని టిష్యూ కల్చర్ ప్లాంట్‌ను పరిశీలించి ఆరా తీశారు. ఈ కేంద్ర బృందానికి నేతృత్వం వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కవి కిశోర్ టిష్యూ కల్చర్ ప్లాంట్ గురించి వివరించారు. టిష్యూ కల్చర్ ప్లాంట్ వల్ల రైతులకు ఎక్కువగా ప్రయోజనం ఉంటుందన్నారు. లక్షల్లో అరటి మొక్కలను ఉత్పత్తి చేయడం వల్ల అటు రైతులకు ప్రయోజనంతో పాటు ఇటు వర్సిటీకి ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం ల్యాబ్ పరికరాలను సందర్శించిన బృంద ప్రతినిధులు పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి, డీన్‌లు పుష్పలత, డాక్టర్ సుమన్, డాక్టర్ అనిత, ఐటీఓఆర్ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ సుజాత, న్యూఢిల్లీ డీబీటీ ఎన్‌సీఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ శ్రీ వాత్సవ పాల్గొన్నారు.

అమ్మో.. ఏనుగులు!

గరుగుబిల్లి: మండల ప్రజలను ఏనుగులు భయపెడుతున్నాయి. గ్రామాలకు సమీపంలో సంచరిస్తుండడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. గిజబ, నందివానివలస, ఖడ్గవలస, సుంకి, సంతోషపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి సంచరిస్తున్నాయి. గిజబ గ్రామంలోని పంటలను నాసనం చేశాయి. ఉపాధి హామీ సమాచార బోర్డులను ధ్వంసం చేశాయి. గ్రామంలోని మరడాన శ్రీనివాసరావుకు చెందిన బోరు పైపులను పీకిపడేశాయి. ఎప్పుడు ఏ గ్రామంలో ఎవరికి హాని చేస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో పొలం పనులకు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ఏనుగుల తరలింపునకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి గురుకులం మిగులు సీట్లకు ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆ పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల ఎంజేపీఏపీ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం 6, 8 తరగతులకు, శుక్రవారం 7, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద గల రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధుడు (60) ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై రవివర్మ బుధవారం తెలిపారు. విజయనగరం నుంచి కొత్తవలస వైపు వెళ్లే రైల్వే ట్రాక్‌పై గుర్తు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. మృతుడి శరీరంపై తెల్లషర్టుపై నల్లటి గడులు గల షర్ట్, హాఫ్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతుడు స్థానిక వ్యక్తేనని అంచనా వేశారు. శవపంచనామా నిర్వహించి విజయనగరం రైల్వే ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేదల బియ్యం పక్కదారి!



బుడతానపల్లిలో వాహనంతో పట్టుబడిన పీడీఎస్ బియ్యం



చంద్రంపేట మిల్లు గోదాంలో పట్టుబడిన పీడీఎస్ బియ్యంపై విచారణ చేపడుతున్న అధికారులు (ఫైల్)

- టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలింపు
- గ్రామాల్లో కొనుగోలుచేసి రైస్ మిల్లులకు తరలిస్తున్న వ్యాపారులు
- గంట్యాడలో నెల రోజుల కిందట 10 టన్నుల బియ్యంతో లారీ పట్టివేత
- కొద్ది రోజుల కిందట చంద్రంపేట రైస్ మిల్లు గోదాంలో 2 టన్నుల బియ్యం సీజ్
- తాజాగా బుడతానపల్లిలో 1500 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం

గంట్యాడ: పౌరసరఫరాల శాఖ పేదలకు సరఫరా చేసిన బియ్యం పక్కదారి పడుతున్నాయి. పలువురు వ్యాపారులు పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు ఇక్కడ కొనుగోలుచేసి పొరుగు రాష్ట్రం, జిల్లాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ వ్యాపారం జోరందుకోవడంతో అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. దాడులు ముమ్మరం చేశారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యంను సీజ్ చేస్తున్నారు.

బియ్యం స్వాధీనం ఇలా...

- గంట్యాడలో నెల రోజుల కిందట సుమారు 10 టన్నుల పీడీఎస్ బియ్యంతో వెళ్తున్న లారీని అధికారులు పట్టుకున్నారు.
- వారం రోజుల కిందట గంట్యాడ మండలం చంద్రంపేట గ్రామంలో ఉన్న రైస్ మిల్లు గోదాంకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో వీఆర్వో వెళ్లి రెండున్నర టన్నుల బియ్యాన్ని, తరలించే వాహనాన్ని సీజ్ చేశారు.
- తాజాగా మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో బుడతానపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర మినీ మోడరన్ రైస్ మిల్లుకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. వెంటనే రెవెన్యూ అధికారులు మిల్లు వద్దకు చేరుకుని పీడీఎస్ బియ్యం తరలించే వాహనాన్ని పట్టుకున్నారు. బుధవారం ఉదయం గంట్యాడ సీఎస్‌డీటీ లగుడు జయలక్ష్మి, రాజాం సీఎస్‌డీటీ చిరంజీవి, ఎస్.కోట సీఎస్‌డీటీ శ్రీనివాస్, ఆర్ఐ హరిప్రియ, వీఆర్వో రవి దీనిపై విచారణ జరిపారు. వాహనంలో తరలిస్తున్నవి 1500 కేజీల పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. రైస్ మిల్లుకు బియ్యం తరలించిన బెవర వెంకటప్పడు, మిల్లు యాజమాని మాటూరి అప్పలరాజుపై 6ఏ కేసు నమోదు చేశారు.

బియ్యం తరలిస్తే చర్యలు

పేదలకు అందజేసే బియ్యాన్ని కొనుగోలు చేయకూడదు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నవారు పట్టుబడితే 6ఏ కేసులు నమోదు చేసి జేసీ కోర్టులో హాజరుపర్చుతాం. బియ్యం మొత్తం సీజ్ చేస్తాం.

– లగుడు జయలక్ష్మి, సీఎస్‌డీటీ, గంట్యాడ

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

గ్రామాల్లోని పేదప్రజల వద్ద చౌకగా కొనుగోలుచేసిన బియ్యాన్ని వ్యాపారులు మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి ఒడిశా రాష్ట్రంతో పాటు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని మరపట్టి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మన్యంలో జ్వరాల వ్యాప్తి

- గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి
- డీఐఓకు విన్నవించిన సీపీఎం నాయకులు



జిల్లా ఇమ్యూనిటీ అధికారి నారాయణరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు

పార్వతీపురం టౌన్: జిల్లాలోని గిరిజన గ్రామాల ప్రజలు జ్వరాలతో వణుకుతున్నారని, తక్షణమే వైద్యశిబిరాలు నిర్వహించి జ్వరాల వ్యాప్తిని కట్టడిచేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇమ్యూనిటీ అధికారి నారాయణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వైరల్, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం కొమరాడ పీహెచ్‌సీలు, చినమేరంగి, పాలకొండ, సీతంపేట, భామినిలోని సీహెచ్‌సీలకు జ్వరపీడితుల సంఖ్య పెరిగిందన్నారు. భద్రగిరి పీహెచ్‌సీ పరిధిలోని చినమేరంగి, లావు ముఠాలో పది పంచాయతీల్లో జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందని తెలిపారు. తక్షణమే ఊరూరా వైద్యశిబిరాలు నిర్వహించాలని, గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బంటుదాసు, గొర్లి వెంకటరమణ, పి.రాము, తదితరులు పాల్గొన్నారు.